క్లుప్తంగా

ఎస్పీని కలిసిన జంకె



ఎస్పీని సన్మానించి బొకే అందిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పరమేశ్వర రెడ్డిని మర్యాద పూర్వకంగా ఏపీఐఐసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి శనివారం ఒంగోలులో కలిసి బొకే ఇచ్చి సన్మానించారు.

జగనన్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి



కృష్ణ చైతన్యను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల అభివృద్ధికి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను కూడా కౌన్సిలర్లు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు ప్రజల్లోనికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య కోరారు. శనివారం ఆయనను పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు కలిశారు. ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పనిచేసి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న అన్నా రాంబాబును మంచిమెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం కృష్ణచైతన్యను ఘనంగా సన్మానించారు. కరీం బాషా, షెక్షావలి, ఉత్తమ్ కుమార్, కరీంసా, హబీబుల్లా ఉన్నారు.

నేడు మేడంవారిపల్లెలో ఎమ్మెల్యే కేపీ పర్యటన

రాచర్ల: మండలంలోని ఒద్దులవాగుపల్లె పంచాయతీ పరిధి మేడంవారిపల్లెలో రూ.65 లక్షలతో నూతనంగా నిర్మాణాలు చేపట్టిన స్టోరేజ్ గోడౌన్, తాగునీటి ఓవర్ ట్యాంకు ప్రారంభించేందుకు మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కందూరు నాగార్జున్‌రెడ్డితో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు ఆదివారం ఉదయం 11 గంటలకు వస్తున్నట్లు రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగారెడ్డి, మేడంవారిపల్లె వైఎస్సార్ సీపీ నాయకుడు బిజ్జం వాణి రాం భూపాల్‌రెడ్డి శనివారం తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

తాళ్లూరు (ముండ్లమూరు): ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన గువ్వల వెంకట సుబ్బారెడ్డికి అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.3 లక్షల చెక్కును శనివారం ఆయన అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ తూము సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పోశం నారాయణరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, గూడా ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాదంపల్లిలో బోరుకు శంకుస్థాపన

యర్రగొండపాలెం: మండలంలోని వాదంపల్లిలో బోరు కోసం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఏవీఎం ట్రస్ట్ మిషన్ అధినేత జాన్‌బాబు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని బోర్లు వేయించడం హర్షణీయమన్నారు. జెడ్పీటీసీ చేదూరి విజయ భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సర్పంచ్ పబ్బిశెట్టి మంజుల శ్రీనివాసులు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశ పరీక్షకు 2023–24 ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి చదివి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2024 ఆగస్టు 31 లోపు జన్మించి ఉండాలని, బీసీ, ఓసీ అభ్యర్థులు 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 లోపు జన్మించి ఉండాలని తెలిపారు. ఇంటర్‌లో చేరేందుకు 2023–24 సంవత్సరంలో పదో తరగతి చదివి మొదటిసారి ఉత్తీర్ణులై ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండాలని తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షను మార్చి 10వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకూ ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను https://apgpcet.apcfss.in పంపాలని, వివరాలకు 94411 49837 నంబరును సంప్రదించాలని తెలిపారు.

గిద్దలూరు నుంచి పోటీ చేయడం సువర్ణావకాశం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పక్కన వైఎస్సార్ సీపీ నేతలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరులో పోటీ చేయడం తనకు సువర్ణ అవకాశమని నియోజకవర్గ సమన్వయకర్త మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆదేశాల మేరకు కేవలం ఆయన ప్రతినిధిగా మాత్రమే ఎన్నికల బరిలో ఉంటున్నానన్నారు. దేశం కోసం పోరాడే సైనికులు ఎక్కువగా ఉండే నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 52 ఏళ్ల నుంచి రాజకీయ అనుభవం కలిగిన కుటుంబం తమదని గుర్తుచేశారు. ఎక్కడా ఎటువంటి చిన్న తప్పు చేసిన దాఖలాలు లేవన్నారు. అటువంటిది కొందరు గిట్టనివారు సోషల్ మీడియాలో తన కుటుంబంపై బురద చల్లేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి వాటిలో నిజం లేదన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. నియోజకవర్గంలో నిరంతరం తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. నియోజకవర్గంలో ఉండే ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు అదనపు నిధులు విడుదల చేయించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సీఆర్‌ఐ మురళి, పూలి రామకృష్ణారెడ్డి, కావేటి ఈశ్వర్‌నాయుడు, కాశిరెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు కేక్ తినిపిస్తున్న షంషేర్ అలీబేగ్, పీఎల్‌పీ యాదవ్

మార్కాపురం: నియోజకవర్గంలో బీసీల సంక్షేమానికి తనవంతు సహకారం చేస్తానని మార్కాపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని బీసీ భవన్‌లో, బీసీ (బీసీ కమ్యూనిటీస్) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఎల్‌పీ యాదవ్, నాగార్జున గౌడ్ తదితరులు నియోజకవర్గంలో బీసీల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను ఎమ్మెల్యే రాంబాబుకు వివరించారు. ఇప్పటికే ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీ భవన్‌ను మంజూరుచేశారని, భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని, బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేయాలని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. వీటిపై ఎమ్మెల్యే రాంబాబు సానుకూలంగా స్పందించారు. అనంతరం కోఆర్డినేటర్‌గా నియమితులైన సందర్భంగా ఏఎంసీ చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషేర్ అలీబేగ్, పీఎల్‌పీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే రాంబాబును ఘనంగా సన్మానించారు. ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మక్బుల్ బాషా, షాదీఖానా కమిటీ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, బీసీ సంఘం నాయకులు రంగస్వామి గౌడ్, టీపీ వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, బుర్రి వెంకటేశ్వర్లు, జి. సుబ్బారావు, వంకేశ్వరం శ్రీనివాస్, పురుషోత్తం, బుల్లెట్ శ్రీను, నాగం రామకృష్ణ, వెంకటేష్, చప్పిడి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు ఇన్‌చార్జి తాటిపర్తి నివాళి



కోటమ్మకు నివాళులర్పిస్తున్న తాటిపర్తి

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎల్.ప్రసాద్ మాతృమూర్తి కోటమ్మ శుక్రవారం రాత్రి స్థానిక ఆమె స్వగృహంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పూలమాల వేసి అంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, ఎంపీపీ వెంకటయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ లాజర్, ఎంపీటీసీ రాములు, డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు కోటేశ్వరరావు, కాశయ్య, వాసు ఉన్నారు.

జయంతికి అభినందనలు



మేడికొండ జయంతి (ఫైల్)

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన మేడికొండ జయంతిని ఆంధ్రప్రదేశ్ మహిళా కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్‌గా నియమిస్తూ ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో ఏపీడబ్ల్యూ సీఎఫ్‌సీ మెంబర్‌గా నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఆమె ప్రస్తుతం మండల జేసీఎస్ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. జయంతికి పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

వలంటీర్లు అభినందనీయులు



తర్లుపాడులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు



ఎమ్మెల్యే అన్నాకు బొకే అందజేస్తున్న బాలచంద్రుడు

తర్లుపాడు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలబడి లంచాలు, వివక్షతకు తావులేకుండా ప్రభుత్వ సేవలు అందిస్తున్న వలంటీర్లు ఎప్పటికీ అభినందనీయులే అని నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు స్పష్టం చేశారు. శనివారం మండలంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడారు. సేవ వజ్ర, సేవ రత్న, సేవ మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను ఘనంగా సన్మానించి ప్రశంసపత్రాలు అందించారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బా రెడ్డి, ఆయా సచివాలయాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, ఇన్‌చార్జి ఈఓఆర్‌డీ బాలకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం పిచ్చయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పెద్ద మస్తాన్, పార్టీ అధ్యక్షుడు మురారి పాల్గొన్నారు.

అన్నాను కలిసి దివ్యాంగులు

కొనకనమిట్ల: గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాంబాబును శనివారం మండల వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల దివ్యాంగుల విభాగం కమిటీ కన్వీనర్ నుసుం బాలచంద్రుడు, పార్టీ నాయకులు శ్రీను, కేశవరావు ఉన్నారు.

గిరిజన తండాల్లో తాటిపర్తికి బ్రహ్మరథం



తాటిపర్తికు హారతి ఇస్తున్న మహిళలు

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్‌కు గిరిజన తండాల్లో ఘన స్వాగతం లభించింది ఆయా సుగాలీ తండాల్లో ఆయనకు బ్రహ్మరథం పట్టారు. మండలంలోని మురారిపల్లెలో శుక్రవారం తాటిపర్తి ఎన్నికల సమర శంఖారావం పూరించిన తర్వాత పిల్లికుంట తండా, కాశీకుంట తండాల్లో ఆయన అర్ధరాత్రి వరకు విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అడవుల్లో నివశించే గిరిజనుల సాదక బాధల గురించి దివంగత నేత వైఎస్సార్‌కు బాగా తెలుసని, అందుకే ఆయన ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టాన్ని అమలు పరిచి భూ హక్కును కల్పించారని, ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం గిరిజన సమస్యలపై ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ తనయుడు జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే అటవీ భూములకు పూర్తి స్థాయిలో చట్ట భద్రత కల్పించారని, బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలతో పాటు రైతు భరోసా వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకంటే ఇంకా మెరుగుగా పథకాలు ఆయన తీసుకొస్తారన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన జగనన్నను మరో సారి ముఖ్యమంత్రిగా చేసుకొని తమ కుటుంబాలను బాగు చేసుకుందామన్నారు. కాశీకుంట తండాలో ఉన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని, వెంటనే అక్కడ బోరు వేయాలని తన అనుచరులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం నేడు



సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

దొనకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఆ వివరాలను స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పార్టీ మండల ఇన్‌చార్జి రమణారెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆదివారం పార్టీ కార్యాలయం, 19వ తేదీ సోమవారం మన ఊరికి మన శివన్న కార్యక్రమం దొనకొండ టౌన్‌లో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొంటారన్నారు. దొనకొండలోని బస్టాండ్ సెంటర్, అరబస్టాన్, శివాజీ నగర్, బేతేలుపురం, బ్రహ్మరావుపేట, సాయిబాబా గుడి వీధి, ముస్లిం బజార్, వీవీపురం, గుట్టమీదపల్లి, ఓబ్బాపురంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తారన్నారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మాజీ కన్వీనర్ కాకర్ల కృష్టారెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ గఫార్, ఎంపీటీసీలు గుంటు అమ్మాజీ అజయ్, తాల్లూరి లక్ష్మీ నగేష్, నూనె వెంకటరెడ్డి పాల్గొన్నారు.

షరీఫ్‌కు బూచేపల్లి పరామర్శ



షరీఫ్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని రామభద్రాపురం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఆదాం షరీఫ్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు శనివారం పరామర్శించారు. ఆదాం షరీఫ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న వారు ఒంగోలులోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

బూచేపల్లి సాయం

దర్శి: పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన మేకల లింగమ్మ రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు ఆపరేషన్ చేయించుకుంది. ఎన్నికల ప్రచారంలో ఉన్న బూచేపల్లి.. ఆమె అనారోగంతో బాధపడుతోందని తెలుసుకుని నేరుగా వెళ్లి రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు వీల్‌చైర్ అందజేస్తానని హామీ ఇచ్చారు. లింగమ్మ కుటుంబ సభ్యులు శివప్రసాదరెడ్డి దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

జంకెకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



జంకె వెంకటరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు



జంకెను సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

పొదిలి రూరల్: ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమితులైన మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని ఆయన నివాసంలో శనివారం పొదిలి మండలం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జంకె వెంకటరెడ్డికి పూలమాలవేసి శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు వాకా సుబ్బారెడ్డి, మోరా అంజిరెడ్డి, గుంటూరి పిచ్చిరెడ్డి, కోటిరెడ్డి ఉన్నారు.

జంకెను సన్మానించిన రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్

దొనకొండ: ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్ కపురం శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి బొకే అందజేశారు. ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. దొనకొండ పరిస్థితుల గురించి జంకెకు శ్రీనివాసరెడ్డి వివరించారు.

సత్తాచాటిన గలిజేరుగుళ్ల విద్యార్థి

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న నారు వెంకట భరత్ ఈఈఎంటీ (ఎడ్యుకేషనల్ ఎఫిషణి మెరిట్ టెస్ట్)లో సత్తాచాటాడు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏడు, పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే మెరిట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో మూడో బహుమతి సాధించాడు. శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతి, ప్రశంసపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వరదారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థి భరత్‌ను అభినందించారు.


రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

పొదిలి రూరల్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కింద మంజూరు చేసిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కనిగిరి రెవెన్యూ డివిజన్ అధికారి జాన్ ఎర్విన్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం పొదిలి నగర పంచాయతీలోని సచివాలయం–3ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

వేలం పాట రేపు

మార్కాపురం టౌన్: ఈనెల 19 సోమవారం ఉదయం పది గంటలకు అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవ రెడ్డి శనివారం తెలిపారు. ఆలయ పరిధిలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, కొబ్బరిచిప్పలు పోగుచేసుకునే హక్కు, అల్పాహారం, కూల్‌డ్రింగ్స్ వగైరాలు, అమ్మవారికి సమర్పించిన చీరెలు, రవికెలను సంవత్సర కాలం పరిధి పోగుచేసుకునే హక్కుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివశంకరరెడ్డి

దర్శి: మార్చి 9వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకుని సత్వర న్యాయం పొందాలని లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకరరెడ్డి తెలిపారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులతో కలిసి పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శివశంకరరెడ్డి మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసుల్లో తక్షణ పరిష్కారం కోసం లోక్ అదాలత్ నిర్వహించటం గొప్ప వరమన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే కంటే రాజీ చేసుకోవటం శుభ పరిణామమన్నారు. రాజీ అంటే ఎవరూ తగ్గినట్లు కాదని, ఇద్దరూ గెలిచినట్లేనని చెప్పారు. కక్షిదారులకు రాజీ ఒక రాజమార్గమని వివరించారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న కేసుల్లో మళ్లీ పైకోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదని స్పష్టం చేశారు. ప్రేమతో ప్రపంచాన్ని జయించవచ్చని, కక్షలు, కార్పణ్యాలు వదిలి మంచి మనసుతో వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. న్యాయవాదులు కూడా కేసులు రాజీలు చేసేందుకు సహకరించాలని కోరారు. న్యాయవాదులు చెన్నకేశవులు, మంజుల, మనోహరమ్మ, బల్లగిరి శ్రీను, కోటిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

పుల్లలచెరువు: మండలంలోని కొమరోలు ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో ఇందిరా ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఎంఈవో ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ముఖ్యంగా విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. రోజూ విద్యార్థుల నోట్ పుస్తకాలను తప్పని సరిగా తనిఖీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా తయారు చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేసి వారి సామర్థ్యాలను పరిశీలించారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ శివకుమార్

పెద్దారవీడు: ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ మేనేజర్ చేరుకూరి శివకుమార్ సూచించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పెద్దారవీడులో కేజీబీవీ, బ్యాంక్ ఆవరణలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన వై. వెంకటేశ్వరరావు, రామదాసు బృందంచే ఆన్‌లైన్ మోసాలపై మ్యాజిక్ షో ద్వారా శనివారం అవగాహన కల్పించారు. మేనేజర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌ను అరికట్టండి.. ఆన్‌లైన్ మోసాలను తరిమి కొట్టండి.. అంటూ నినదించారు. బ్యాంక్ నుంచి మేనేజర్‌ను ఫోన్ చేస్తున్నానని మీ ఆధార్ నంబర్ చెప్పాలని, ఫోన్‌కు ఓటీపీ నంబర్ వచ్చిందని, ఆ నంబరు చెప్పండి అని అడుగుతుంటారని, అలాంటి వ్యక్తులకు ఎలాంటి సమాధానం చెప్పకూడదని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల వద్ద ధంబు వేసి డబ్బులు తీసుకోవద్దని చెప్పారు. ఏటీఎంలో డబ్బులు తీసుకునేటప్పుడు గుర్తు తెలియని వ్యక్తులకు ఏటీఎం కార్డులు ఇవ్వరాదని, పిన్ నంబర్ చెప్పకూడదని, అలా చెబితే విలువైన డబ్బు వృథాగా పోగొట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ ఆర్‌వీకేఎస్ ప్రసాద్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలపై దృష్టి సారించాలి

కొనకనమిట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపాయలు కలిపించటంతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినులు నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కార్యచరణ రూపొందించి అమలు చేయాలని ఎంఈఓ ఎస్‌కే డాంగే షరీఫ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఉన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు తెలియజేయాలి

గిద్దలూరు రూరల్: ఓటర్ల జాబితాలో తప్పులు తెలియజేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామసుబ్బయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయం వస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాలు తయారు చేశామన్నారు. అందులో ఎటువంటి తప్పులు ఒప్పులు ఉన్నా మీరు వాటిని గుర్తించి అధికారులకు తెలియజేసి వాటిని సవరించుకోవాలని కోరారు. తహసీల్దార్ సిద్ధార్థ్, వైఎస్సార్, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.